క్లుప్తంగా

అయ్యప్ప సేవా సమితికి జ్ఞాపిక అందజేత



జ్ఞాపికను అందుకుంటున్న అయ్యప్పస్వామి సేవా సమితి కమిటీ, సభ్యులు

జమ్మికుంట: జమ్మికుంట అయ్యప్పస్వామి దేవాలయం అయ్యప్ప సేవా సమితికి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వేదిక యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలోని వేదికల సభ్యులను ఆహ్వానించారు. ఈసందర్భంగా స్వర్ణోత్సవ జ్ఞాపికలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో అయప్ప దేవాలయం అధ్యక్షుడు జయేందర్, గురుస్వామి ప్రతాప్‌రెడ్డి, అయ్యప్ప సేవా సమితి స్వాములు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మాచమల్ల రమణయ్య, నాయకులు కానుగంటి సత్యనారాయణరెడ్డి, బద్దిపడిగ మల్లికార్జున్ రెడ్డి, మాచమల్ల కిషోర్, కుమార్, పంచాయతీకార్యదర్శి నాగరాజు పలువురు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి గ్రామాలలో పశువైద్యాధికారులు శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 424 పశువులకు టీకాలు వేశామని, పశురక్షణ, సీజనల్ వ్యాధులను వైద్యాధికారులు అరవింద రెడ్డి, సుస్మితారెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు రవుల్ల, విజయలక్ష్మీ, మమత, సంధ్యా, రాణా, కిరణ్, కనకయ్య, పోచయ్య, రాజయ్య, కొమురయ్య,మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రమిస్తున్న ఇల్లందకుంట గ్రామస్తులు

ఇల్లందకుంట: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఇల్లందకుంట గ్రామస్తులు శనివారం ఎంపీడీవో పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామసభల్లో పేర్లు చదివారని, ఇందిరమ్మ కమిటీల తరువాత పేర్లు రాకుండా పోయాయన్నారు. ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. అర్హుల జాబితా లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూస అశోక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

సైదాపూర్: డ్రగ్స్ వ్యతిరేక పోరుయాత్రలో భాగంగా శనివారం మండలంలోని అమ్మనగుర్తి, బొమ్మకల్, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాములపల్లి, ఎలబోతారం గ్రామాల్లో మహిళా గ్రామైఖ్య సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. హుస్నాబాద్ జేఏసీ కోఆర్డినేటర్ సారయ్య మాట్లాడుతూ.. చదువుకొని తల్లిదండ్రుల కలలను సకారం చేయాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డ్రగ్స్ యువతను పెడదారి పట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ కోఆర్డినేటర్ ద్యాగల సారయ్య, చెప్యాల ప్రకాశ్, ఏపీఎం కుమారస్వామి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సమ్ము రజిత, మహిళలు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత

గన్నేరువరం: అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు జేసీబీ పట్టుకున్నామని ట్రైనీ ఎస్సై అరుణ్ తెలిపారు. మండలంలోని గునుకులకొండాపూర్‌లోని వరద కాల్వ మట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్నారని శనివారం నీటి పారుదలశాఖ ఏఈఈ మహేందర్ ఫిర్యాదుతో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

మద్యం మత్తులో పల్లెలు

- పర్యవేక్షణ లేకపోవడంతో పెట్రేగిపోతున్న పోకిరీలు
- పోలీసులు నిఘా పెట్టాలంటున్న గ్రామస్తులు





కోర్కల్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లు(ఇన్‌సెట్లో) చల్లూరులోని మల్లారికుంట

వీణవంక: మండలంలోని పలు ప్రాంతాలు ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో అటువైపు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో పోకిరీల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు. గతంలో పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహిస్తూ పలు ప్రాంతాలపై నిఘా పెట్టేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించకపోవడంతో మందుబాబులు పెట్రేగిపోతున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 52వేల జనాభా ఉంది. కోర్కల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో పగలు, రాత్రి తేడా లేకుండా పేకాట ఆడుతున్నారు. మరికొందరు దావత్‌లు చేసుకుంటూ చిందులేస్తున్నారు.

➡ చల్లూరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న మల్లారికుంట మందుబాబులకు స్థావరంగా మారింది. ఇక్కడ రెండు మద్యం దుకాణాలు ఉండటంతో మద్యం కొనుగోలు చేసి కుంట వద్ద సేవిస్తున్నారు. కుంటను ఆనుకొని గుట్ట ఉంది, గుట్టపై అయ్యప్ప ఆలయం నిర్మిస్తున్నారు. అటు వైపు వెళ్లే భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

➡ ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న ముట్టిగుట్ట అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. ఇక్కడ శ్మశాన వాటిక నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేదు. గంజాయి సేవిస్తూ పేకాట ఆడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీరిలో మైనర్లే ఎక్కువని ప్రచారం జరుగుతోంది.

➡ వీణవంక సబ్‌స్టేషన్ వెనక ప్రాంతం, రైతు వేదిక మద్యం దుకాణాలను తలపిస్తున్నాయి. రైతు వేదిక చుట్టూ మందుబాబులు తాగిపడేసిన సీసాలే దర్శనమిస్తున్నాయి. కోర్కల్, వల్భాపూర్‌లోని రైతు వేదికల్లో ఇదే దుస్థితి నెలకొంది. గ్రామాల చివరన నిర్మించడంతో పేకాట, గంజాయి, మద్యం స్థావరాలుగా మారుతున్నాయి.

➡ చల్లూరు నుంచి బొంతుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో సాయంత్రం ఆరు దాటితే రోడ్డుపైనే మందుబాబులు మద్యం తాగుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు, రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించాలని, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల హక్కులను హరించొద్దు



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

జమ్మికుంట: కార్మికుల హక్కుల కోసం మే డే స్ఫూరితో పోరాడుదామని అఖిల భారత మహిళా సమఖ్య రాష్ట్ర నాయకురాలు వలిపిరెడ్డి సరోజ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో మే డే ఉత్సవాలలో భాగంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించొద్దని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులను దోపిడీ చేస్తున్న వారికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో కార్మిక నాయకులు లింగస్వామి, కార్మికుల సంఘల ప్రతినిధులు ,కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించండి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న స్వప్న, తదితరులు

జమ్మికుంట: జమ్మికుంట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. రాజును జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వప్న, అడ్తిదారులు, దాడువాయిల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రైతులు, ప్రజల సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దొడ్డ శ్యామ్‌కుమార్, కందాల తిరుపతి, అడ్తిదారులు మర్రి రాంరెడ్డి, ఎగిత అశోక్, మర్రి తిరుపతి, గుత్తి కుమార్, శ్రీనివాస్, రవీందర్, సతీష్, పాపిరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



హుజూరాబాద్: పట్టణంలోని మధువని గార్డెన్‌లో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్ టెక్నికల్, సేఫ్టీ ఆఫీసర్ ఉపేందర్, డివిజనల్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించడం అత్యంత అవసరమన్నారు. విద్యుత్ సంబంధిత ప్రమాదాలకు దూరంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించడం వల్ల ప్రాణ నష్టం జరగకుండా కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ భద్రతా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్తు ఉద్యోగులు ఉన్నారు.





మానకొండూర్‌రూరల్: పనులు ప్రారంభిస్తున్న ప్రవీణ్, గంగాధర: మధురానగర్‌లో..

అభివృద్ధి పనులు ప్రారంభం

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను శనివారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ మధురానగర్‌లో అభివృద్ధి పనులకు నిధులు కావాలని కోరగానే స్పందించి మంజూరు చేశారని పేర్కొన్నారు. పనుల ప్రారంభోత్సవంలో పెరుక శ్రావణ్‌కుమార్, వైద రామానుజం, పంజాల ప్రశాంత్, కోల అశోక్, సదాల భాస్కర్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, రేండ్ల శ్రీనివాస్, హర్షరాజు, ఆకుల మనోహర్, వొడ్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాలలో శనివారం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ మంచినీటి బోర్ బావి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక నిధుల ద్వారా మంచినీటి బోర్‌బావి పనులను చేపడుతున్నామని తెలిపారు. నీటి ఎద్దడి దృష్ట్యా బోర్ వెల్ వేయిస్తున్నామని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర సెన్సార్ ఫిల్మ్‌బోర్డు సభ్యుడు రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, శ్రీనివాస్, హరీశ్, శేఖర్, ఓదెలు, అశోక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భగా ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



సన్మానిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని పార్టీ రాష్ట్ర పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అధ్యక్షతన పార్టీ నిర్మాణ, సంస్థాగత సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తుందన్నారు. గడచిన కాలంలో ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ కార్యకర్తల కృషితో మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. అనంతరం వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి, భగవాన్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు తదితరులున్నారు.

సమాచారం

5 నుంచి రిజిస్ట్రేషన్స్, ఈకేవైసీ



సైదాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లబ్ధికోసం రైతులు రిజిస్ట్రేషన్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వైదేహీ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్‌లో ప్రకటించిన విధంగా ఈనెల 5 నుంచి జూన్ 4 వరకు గ్రామాల్లో నిర్వహించే రైతు సదస్సుల్లో రైతులు భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటూ రిజిస్ట్రేషన్లు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామసభ రోజు రైతులు భూమి పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ మొబైల్ వెంట తీసుకొని రావాలని సూచించారు.

వివరాలు అందజేయాలి

గంగాధర: సోమవారం నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ (రైతుల వివరాల నమోదు) కార్యక్రమం ప్రారంభించనున్నట్లు గంగాధర ఏడీఏ ప్రియదర్శిని తెలిపారు. మండలంలోని బూర్గుపల్లి, కురిక్యాల,గంగాధర, గర్శకుర్తి, మల్లాపూర్ రైతు వేదికల్లో ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మే 5 నుంచి జూన్ 4 వరకు నెల రోజుల పాటు వివరాలు నమోదు చేసుకుంటారని, క్లస్టర్ పరిధిలోని గ్రామాల వారిగా కేటాయించిన తేదీల ప్రకారం సంబంధిత గ్రామాల రైతులు వచ్చి వివరాలు అందజేయాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌లింక్ ఫోన్‌నెంబర్, వివరాలను ఏఈవోలకు వివరించాలని సూచించారు. వీటి ఆధారంగానే రైతులకు ఐడీ నెంబర్ కేటాయిస్తారని, నంబర్ ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందజేస్తారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి గ్రూపుకు 40 సీట్లు ఉన్నాయని, ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చల్లూరులో డిప్యూటీ సీఈవో విచారణ

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్ విచారణ జరిపారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అక్రమంగా దుకాణాలు నిర్మించారని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ రఘునాథ్‌రెడ్డి ఇటీవల ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరపాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పవన్‌కుమార్ గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. వెంట ఎంపీడీవో శ్రీదర్, ఎంపీవో సురేందర్, ఎంఈవో శోభరాణి పాల్గొన్నారు.

నేత్ర దానం

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన మద్దూరి వినోద(65) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను శనివారం కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు నేత్రదానంకు అంగీకరించగా తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వరంగల్ ప్రాంతీయ ఆస్పత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ నేత్రాలు సేకరించారు. నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపునిచ్చిందని అసోసియేషన్ ప్రతినిధులు మల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డిలు పేర్కొన్నారు.

అభినందన

కొత్తపల్లి: కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన వెంకటలక్ష్మీని శనివారం బీజేపీ నాయకులు వేర్వేరుగా కలిశారు. బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, నాయకులు, కొత్తపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి శివ కుమార్, మండల అధ్యక్షుడు కె.తిరుపతి, కొత్తపల్లి జోన్ అధ్యక్షుడు ఎం.హరీశ్, మాజీ మండల అధ్యక్షుడు రతన్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మహేశ్వర్, రైతు సంఘం నాయకులు, తదితరులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సర్వే నంబర్ 685లో రైతువేదిక, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలాన్ని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పరిశీలించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు శనివారం మార్కెట్ ప్రతిపాదిత స్థలం అనువుగా ఉందని, జిల్లా డీ.ఐ, చిగురుమామిడి సర్వేయర్లు సంయుక్తంగా కొలతలు వేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. స్థలాన్ని చదును చేసి తగిన సౌకర్యాల కల్పనకు కలెక్టర్‌కు సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. రైతు సంఘం అధ్యక్షుడు కత్తుల రమేశ్ మాట్లాడుతూ.. పదేళ్లుగా సరైన సౌకర్యం లేక ఏటా లక్ష రూపాయలకు లీజుకు తీసుకుని ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఆర్డీవోకు విన్నవించారు. వచ్చే సీజన్ వరకు స్థలాన్ని సమానం చేస్తే పట్టా సర్టిఫికెటు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేశం, హమాలీ సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు చట్ల మొగిలి, వెంకటరాజయ్య, మాద్యర వరి, రైతు సంఘం ఉపాధ్యక్షులు పెండ్యాల సదానందం, కంది శంకర్, మామిడి వెంకటయ్య, ప్రధానకార్యదర్శి తోట శ్రీనివాస్, మేదరవేణి ప్రవీణ్‌కుమార్, దరి పెల్లి రమేశ్, కొంకట రవి, సీఏలు దేశిని జ్యోతి, మైలగాని సుజాత, కొంకట నిర్మిల, కొమిరే జ్యోతి రైతులున్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై రాద్ధాంతం చేయొద్దు



మాట్లాడుతున్న కళ్యాణ్‌చంద్ర, తదితరులు

మానకొండూర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై కొందరు చేస్తున్న ఆరోపణలతో నిరుపేద ముస్లింలకు అన్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టంతో ఏ విషయంలో అన్యాయం జరిగిందో చెప్పకుండా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కొందరు పనిగట్టుకొని రాద్ధాంతం చేస్తున్నారని, పేద ముస్లింల ఆస్తులను దోచుకుని, వక్ఫ్‌బోర్డుతో ఇన్నేళ్లు అన్ని విధాల ప్రయోజనం పొందిన వారికి సవరణ చట్టం మింగుడు పడటం లేదని, అందుకే చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని, దేశంలో ఆర్మీ, రైల్వే తర్వాత వక్ఫ్ బోర్డుకు లక్షల కోట్ల ఆస్తి, సంపద ఉండి ఇన్నేళ్లు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేసిందనే విషయాన్ని గ్రహించాలన్నారు. కాంగ్రెస్ వక్ఫ్‌కు సర్వ హక్కులు దారపోయడం శాపంగా మారాయని, ముస్లిం దేశాల్లో వక్ఫ్ చట్టం లేదనీ, కాంగ్రెస్ ఓటు బ్యాంకు కోసం వక్ఫ్ బోర్డుకు అధికారం ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మియాపురం లక్ష్మణాచారి, మాచర్ల కోటేశ్వర్, మార్కొండ రమేశ్ పటేల్, భాష బోయిన ప్రదీప్‌యాదవ్, నాయకులు నందగిరి బలరాం తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలయ్యేవరకు పోరాడాలి



మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యుడు సృజన్‌కుమార్

రామడుగు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల తరుపున పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నాయకుడు, కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు గొడిశాల తిరుపతి గౌడ్,మచ్చ రమేశ్,కీర్తి కుమార్, దాము భూమయ్య, బీరయ్య, లక్ష్మణ్ తదిరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి హక్కుల కోసం ఉద్యమించాలి



జెండా ఆవిష్కరిస్తున్న అశోక్

సప్తగిరికాలనీ(కరీంనగర్), విద్య, ఉపాధి హక్కుల కోసం నిరంతరం ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి విద్యా, ఉపాధి అవకాశాలు అందరికీ అందకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి యుగంధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు బూడిద సదాశివ, సాంబరాజు, హేమంత్, అరవింద్, రాజు, అజయ్, చందు, రమేశ్, సురేశ్, బాబు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పొంతన లేని మాటలు’



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠ రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి పొంతన లేని మాటలు మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని బద్దంఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌బకాయిలు విడుదల లేక కళాశాలలు పరీక్షలు నిర్వహించలేక డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే డిగ్రీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుండా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్, శ్రవణ్, రాజేశ్, శివ తదితరులు పాల్గొన్నారు

సమ్మర్ క్యాంపులను ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాలి

కరీంనగర్‌కల్చరల్: ఉచిత సమ్మర్ క్యాంపులను ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటే కరీంనగర్ జిల్లా పాలన అధికారులు మాత్రం ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో శిక్షణ శిబిరాలు, క్రీడా ఉత్సవాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలకు అతిథులుగా వెళ్లి ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించడంపై ఆసక్తి చూపడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ ప్రోగ్రాంపై కురిక్యాలలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు వచ్చి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత కోచింగ్‌ల పేరుతో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థలను అతలాకుతలం చేయడం సరికాదన్నారు. ఈ ఉచిత కోచింగ్‌ల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే అవకాశం తక్కువ అవుతాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉచిత సమ్మర్ క్యాంపులను ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహించాలని కోరారు.

పారిశ్రామిక కంపెనీలకు సమ్మె నోటీసులు

విద్యానగర్(కరీంనగర్): దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ నాయకులు కరీంనగర్ జిల్లాలోని పారిశ్రామిక కంపెనీలకు, రైస్ మిల్లర్లకు, గ్రానైట్ పరిశ్రమలకు, వివిధ కంపెనీలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, హరిత భయ ప్రొడక్ట్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మడిపల్లి మహేందర్, ఉపాధ్యక్షులు మహేందర్, అశోక్, గురు భూషణ్, నాయకులు శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.